క్లుప్తంగా

ఎల్‌జీ బెస్ట్ షాప్ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న వెంకటకృష్ణాజీ, మట్టుపల్లి సాయి

పాతగుంటూరు: గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వారి బెస్ట్‌షాపు బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ రీజనల్ బిజినెస్ హెడ్ కరాటం వెంకటకృష్ణాజీ పాల్గొని షాపును ప్రారంభించారు. ఈసందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ నగరంలో ఎల్‌జీ షోరూం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. షోరూంలో అన్నిరకాల గృహోపకరణ ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్‌బాబు, మట్టుపల్లి అప్లయన్స్ అధినేత మట్టుపల్లి సాయి మాట్లాడుతూ కష్టమర్లకు కావల్సిన సర్వీస్, బంపర్ డ్రా కూపన్‌లు, బహుమతులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం



పాతగుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. రాగంవెంకట లీలా సుందరి, మస్తాన్ రావు దంపతుల ఆధ్వర్యంలో భక్తుల జై శ్రీ రామ్ నామస్మరణతో, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కల్యాణ విశేషాలను వివరిస్తూ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

సంగీత నృత్య అకాడమీ సభ్యురాలిగా విజయలక్ష్మి



పాతగుంటూరు: ఆంధ్ర ప్రదేశ్ సంగీత నృత్య అకాడమీ సభ్యురాలిగా గుంటూరుకు చెందిన మేరిగ విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ నుంచి నియామక ఉత్తర్వులు పొందారు. రెండు సంవత్సరాలు ఈ పదవిలో విజయలక్ష్మి కొనసాగనున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



పట్నంబజారు: సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. పట్టాభిపురంలోని వివేకానంద విగ్రహం సెంటర్లో దుర్గా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాటసారులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, డివిజన్ ఇన్‌ఛార్జ్ టీఎల్‌వి వీరాంజనేయులు, డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

30న స్వరమాధురి సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఈ నెల 30న 'ఎన్నాళ్ళో వేచిన ఉదయం' పేరున సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు స్వరమాధురి సంస్థ అధ్యక్షుడు శెట్టి థామస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే విభావరిలో గాయకులు మధురమైన పాటలు ఆలపిస్తారని సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

హైవేపై కారు బోల్తా

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. బుధవారం ఉదయం సమయంలో చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరు వైపు వస్తున్న వేగంగా వస్తున్న కారు ప్రత్తిపాడు మండలం పార్వతీపురం సమీపంలోని పార్వతిదేవి అమ్మవారి దేవాలయం సమీపంలో టైర్ పంక్చర్ అవ్వడంతో సైడ్ మార్జిన్‌లో ఉన్న ఫెన్సింగ్ సిమెంట్ పోల్స్‌పైకి కారు దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అయితే అదృష్టవశాత్తూ కారులోని బెలూన్లు ఓపెన్ అవ్వడంతో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారని స్థానికులు చెబుతున్నారు.

వేర్వేరు డివిజన్లలో 'మా నమ్మకం నువ్వే జగన్'

- హాజరైన ఎమ్మెల్యే మద్దాళి గిరి, కార్పొరేటర్లు
- ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు


34వ డివిజన్ కో బాల్ట్‌పేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దాళిగిరి, కార్పొరేటర్ బూసి రాజలత

లక్ష్మీపురం: కనీవినీ ఎరగని రీతిలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రజల నుంచి ప్రజాదరణ రోజురోజుకు పెరిగిపోతుందని పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి అన్నారు. స్థానిక 34వ డివిజన్‌లోని 122వ సచివాలయం పరిధిలోని కోబాల్ట్‌పేట 4వ లైన్‌లోని డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత ఆధ్వర్యంలో, 35వ డివిజన్‌లోని 101వ సచివాలయ పరిధిలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ రోడ్డులోని రాఘవేంద్ర స్వామి దేవస్థానం నుంచి డివిజన్ ఇన్‌చార్జ్ టీఎల్‌వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయా డివిజన్‌లలోని సచివాలయాల పరిధిలోని స్థానిక నిర్వాసితులతో ఎమ్మెల్యే గిరి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరాతీసి ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్స్‌ను అంటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఈ కార్యక్రమం ప్రారంభం నుంచి నేటి వరకు వాడవాడల పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు స్థానికులు నిరాజనాలు పలుకుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాం అంటు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి జగన్‌కు స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

ఒకవైపు ప్రజాదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఎలాగైన ప్రజలను తప్పుదోవ పట్టించాలని కంకణం కట్టుకున్నారని అయితే ప్రజలు వారి మాయమాటలకు ధీటైన సమాధానం చెబుతున్నారన్నారు. ప్రజాదరణ ఉన్న నాయకుడు ప్రజల నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి నిరంతరం రాష్ట్రం ఒక పక్క లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ప్రజలకు తాను చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వ సంక్షేమాలను సకాలంలో అందేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరు వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేసి ప్రతి పక్ష పార్టీలకు తమ అమూల్యమైన ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధానంగా ప్రతి పక్ష పార్టీలు రోడ్ షోలు, పాదయాత్రలు అంటూ ఆయా ప్రాంతాలలో వివాదాలు సృష్టించడం గ్రూపులు చేయడం చేస్తు రాష్ట్ర ప్రజలను దారి మళ్లించే యత్నం చేసేందుకు కుయుక్తులు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి కుట్రలు చేసిన ఎటువంటి కుతంత్రాలకు పాల్పడిన ప్రజలు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో కూడా రాష్ట్ర ప్రజలు మరలా జగన్ మోహన్‌రెడ్డిని పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాల వారికి అన్ని సామాజిక వర్గాలకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు అందించి మీకు తోడుగా ఉన్నా అని పిస్తే మీ బిడ్డను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు మద్దతు ఇవ్వండని స్వచ్ఛందంగా ధైర్యంగా బహిరంగ సభలలో చెప్పే దమ్మున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఇటువంటి ప్రజా సంక్షేమం కోసం పాటు పడే నాయకుడు నాయకత్వంలో కోవిడ్ వంటి ప్రమాదకరమైన సమయంలో సైతం మీకు తోడుగా నేను ఉన్నా అంటు అండగా నిలిచిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, డివిజన్ నాయకులు, సచివాలయ అడ్మిన్‌లు, వార్డు వాలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

థలసేమియా చిన్నారుల కోసం...

- సంచార రక్త నిధి వాహనం
- నీడ్స్ సొసైటీ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్


సంచార రక్తనిధి వాహనాలను ప్రారంభిస్తున్న శ్రీధర్

గుంటూరు మెడికల్: థలసేమియా చిన్నారులకు రక్తదానం చేసేవారి వద్ద నుంచి రక్తాన్ని సేకరించేందుకు నీడ్స్ థలసేమియా కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత సంచార రక్తనిధి వాహనాన్ని ప్రారంభిస్తున్నామని నీడ్స్ సొసైటీ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్ చెప్పారు. బుధవారం స్థానిక కాకాని రోడ్డులోని నీడ్స్ థలసేమియా కేర్ సెంటర్‌లో థలసేమియా చిన్నారుల సహాయార్థం ఉచిత రక్తనిధి సంచార వాహనాన్ని శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీడ్స్ సొసైటీని 2008లో ప్రారంభించామని, ఇప్పటి వరకు పదివేల మంది థలసేమియా చిన్నారులకు ఉచితంగా రక్తదానం చేయడంతోపాటు, రక్తమార్పిడి సేవలు కూడా ఉచితంగా అందించామన్నారు. రక్తనిధి సంచార వాహనం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రక్తాన్ని సేకరిస్తోందని, ఆ రక్తాన్ని వ్యాధి సోకిన చిన్నారులకు ఉచితంగా అందిస్తుందని వెల్లడించారు. థలసేమియా చిన్నారులకు ప్రతినెలా 200 యూనిట్ల రక్తం అవసరమని చెప్పారు. అందుకోసం సంచార రక్తనిధి వాహనాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కల్పించి రక్తాని సేకరిస్తామన్నారు. చిన్నారుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా థలసేమియా చిన్నారుల ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోపూరి భాస్కర్ నాయుడు, నీడ్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముప్ప రాజు శ్రీనివాసరావు, రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ యడ్లపల్లి సందీప్, పెథాలజిస్ట్ డాక్టర్ మణికంఠ, డాక్టర్ చదలవాడ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరు సాధనకు కృషి చేద్దాం

నగర కమిషనర్ కీర్తి చేకూరి


మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ప్రజారోగ్య విభాగ, ఇంజినీరింగ్ అధికారులు, శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుద్ధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని, కార్మికులు, శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరింత బాధ్యతగా పిన్ పాయింట్ ప్రకారం విధులు నిర్వహిస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ లో నగరానికి మెరుగైన ర్యాంక్ రావడం పెద్ద కష్టం కాదన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో కొందరు అంకిత భావంతో పని చేస్తున్నప్పటికీ, మరి కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని. అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రతి షాప్ ముందు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, వ్యర్థాలను రోడ్లపై, కాల్వల్లో వేసే షాప్స్ సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా కార్మికులను కేటాయించాలని, రోడ్ల వెంబడి కాల్వలు ఫ్రీ ఫ్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారుల నుండి చెత్త సేకరణకు ప్రత్యేక సమయం కేటాయించాలని, రోడ్ల మీద వ్యర్థాలు వేసే వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాలు సేకరించే కాంట్రాక్టర్లు ప్రతి రోజు సేకరణ చేస్తుంది, లేనిది పరిశీలించాలన్నారు. నిర్మాణాలు జరుగుతున్న భవనాలకు ప్లానింగ్ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి కార్యదర్శి ప్రజలకు హోం కంపోస్ట్ తయారీ ప్రాధాన్యత, తయారీ విధానంపై అవగాహన కల్గించాలని, అలాగే అపార్ట్మెంట్లలో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ చేసే సమయంలోనే ఆర్.ఎఫ్.ఐ.డి. ట్యాగ్ లను స్కాన్ చేయాలని, స్కానర్లు మరమ్మతు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఎస్.ఐ.డివిజన్ల వారిగా రూట్ మ్యాప్ ప్రకారం చెత్త తరలింపుకు వాహనాలు వచ్చేలా వెహికిల్ షెడ్ అధికారులు చూడాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్, ప్లానింగ్ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, భవన నిర్మాణ వ్యర్థాలు, గ్రీన్ మ్యాట్ ల ఏర్పాటు ఇతర సంయుక్త సమస్యలపై సమన్వయం చేసుకోవాలన్నారు.

2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం మెరుగైన ర్యాంక్ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారం, ఎండార్స్‌మెంట్ ఇవ్వడం పై కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రేడ్ లైసెన్స్ నూతనంగా మంజూరు చేసేప్పుడు సదరు సంస్థ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు చెల్లించి ఉంటేనే దరఖాస్తు ప్రాసెస్ చేయాలని శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. పన్ను వివరాల కోసం సంబంధిత వార్డ్ అడ్మిన్ కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో తొలుత ఇటీవల మృతిచెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొలాకి నివాళి అర్పించిన కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మరీ ముఖ్యంగా ప్రజారోగ్య విభాగ సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ. కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గా ప్రసాద్, బయాలజిస్ట్ మధుకుమార్, యస్.యస్.లు రాంబాబు, ఆనందకుమార్, ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునిక చికిత్స విధానాలు అందిపుచ్చుకోవాలి

డాక్టర్ బి.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు, పక్కన డాక్టర్ జయంతి, డాక్టర్ సేవకుమార్

గుంటూరు మెడికల్: ప్రసవం విషయంలో వైద్యులందరూ ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శక సూత్రాలను పాటించాలని, అనవసర సిజేరియన్ ఆపరేషన్లను నిరోధించాలని కాటూరి వైద్య కళాశాల, గైనిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గుంటూరు జీఎంఏ హాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో వైద్యవిద్య కార్యక్రమం జరిగింది. ప్రసూతి వైద్యం, వంధత్వం, స్త్రీలలో ప్రత్యుత్పత్తి అవయవాల వ్యాధులు, అబ్డామినల్ పెయిన్ 'తదితర అంశాలపై నిర్వహించిన వైద్య విద్యా కార్యక్రమంలో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షులు, డాక్టర్ టి. సేవ కుమార్ సారథ్యం వహించారు. డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రసవాల విషయంలో ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ మంచి మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. దేశవ్యాప్తంగా వైద్యులందరూ తప్పక వాటిని అధ్యయనం చేయాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు తల్లి బిడ్డలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్త నంతవరకు సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. గర్భం ధరించినప్పటి నుంచి గర్భవతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు ప్రసవ సంబంధ శాస్త్రీయ సమాచారాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రగతి ఐవీఎఫ్ సెంటర్ వైద్య నిపుణురాలు, డాక్టర్ కొల్లి అనిత మాట్లాడుతూ నేడు పిల్లల పుట్టకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. తొలుత ఎక్కడ లోపం ఉందో తెలుసుకునేందుకు దంపతులకు తప్పనిసరిగా పరీక్షలు చేయాలన్నారు. కారణాలను తెలుసుకున్నాకే మందుల ద్వారా గర్భధారణ సాధ్యాసాధ్యాలను నిర్ధారించుకోవాలన్నారు. నేడు అనేక కృత్రిమ గర్భధారణ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాల గైనిక్ విభాగాధిపతి డాక్టర్ పి.జయంతి మాట్లాడుతూ స్త్రీలలో అండాశయ, గర్భాశయ సంబంధ వ్యాధులు నొప్పులకు కారణమవుతున్నాయన్నారు.

మహిళల్లో అబ్డామినల్ నొప్పి అనగానే తొలుత వారి వయసును బట్టి కారణాలను విశ్లేషించాలని తెలిపారు. నొప్పికి కారణాలు గుర్తించి, అవసరమైన పూర్తి చికిత్స చేయవచ్చని వెల్లడించారు. ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, ఐఎంఏ గుంటూరు శాఖ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

30న ఆరాధన గురుపూజ మహోత్సవం

పాతగుంటూరు: లాడ్జి సెంటర్‌లో బ్రహ్మంగారి వీధిలోని జగద్గురు శ్రీమద్‌విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి 330వ ఆరాధన గురుపూజ మహోత్సవం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి తమ్మా శివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి నగర సంకీర్తన నగరోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తులపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బ్రాడీపేట 2/7లోని ఓ ఇంటిని వెంకట్, దుర్గాప్రసాద్ అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడిచేసి వెంకట్, దుర్గాప్రసాద్‌తోపాటు, విటుడిని, మహిళను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, మహిళను రెస్క్యూ హోంకు తరలించారు.

మోసం చేసిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం నాయుడుపేటకు చెందిన మక్కెన బాలకృష్ణకు గోరంట్లకు చెందిన వరలక్ష్మి హైదరాబాద్‌కు చెందిన వెంకటకృష్ణ పరిచయమయ్యారు. తమకు పలుకుబడి ఉందని, హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. బాలకృష్ణ వరలక్ష్మీ కుమార్తె గాదె భావన అకౌంట్‌కు రూ. 2 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అపాయింట్‌మెంట్ లెటర్ ఇస్తామని నమ్మించడంతో వెంకటకృష్ణకు రూ. 20 వేలు పంపారు. అయితే ఉద్యోగం ఇప్పించకపోగా, అడిగినప్పుడు వరలక్ష్మీ, వెంకటకృష్ణలు ఇరువురు బాలకృష్ణను బెదిరించారు. బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సస్పెన్షన్లు ఆపండి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో ఉపాధ్యాయులపై విధిస్తున్న సస్పెన్షన్లను ఆపివేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ పేర్కొన్నారు. బుధవారం నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్ర ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఏదో ఒక కారణాన్ని చూపిస్తూ, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఫ్యాప్టో నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం ద్వారా విద్యాభివృద్ధి జరగదని, ఉన్నతాధికారులు తమ విధులను మానుకుని ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని సస్పెండ్ చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో కో-చైర్మన్లు జి. వెళాంగిణిరాజు, గేరా మోహనరావు, ఫ్యాప్టో కార్యదర్శి బి. ఆదిలక్ష్మి, నాయకులు ఎండీ ఖాలీద్, మేకల సుబ్బారావు, ఎండీ ఖాలీద్, శివపార్వతి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు


అర్క విద్యాసంస్థల విద్యార్థులతో వేంకటప్రసాద్, మల్లిఖార్జునరెడ్డి


ఎన్. ఆకాష్ వెంకట్, 466 మార్కులు, జూనియర్ ఎంపీసీ


రుచితా హాసిని, 434 మార్కులు, జూనియర్ బైపీసీ



బ్లెస్సీ, 434 మార్కులు, జూనియర్ బైపీసీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ఆర్క విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ చైర్మన్ బి. శ్రీరామ్ తెలిపారు. లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో గోగినేని అభినవ్ 470కి 465 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. 460 మార్కులకు పైగా సాధించిన వారు 14 మంది, 450కి పైగా సాధించిన వారు 58 మంది ఉన్నట్లు వివరించారు. బైపీసీ విభాగంలో శామ్యూల్ నాథర్ 440కి 431 మార్కులు సాధించగా, 420కి పైగా సాధించిన విద్యార్థులు 10 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. సీనియర్ ఎంపీసీలో టి. హర్షిత్ సూర్య, షేక్ నక్ష వెయ్యికి 984 మార్కులు సాధించగా, 950 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 41 మంది ఉన్నారని తెలిపారు. బైపీసీ విభాగంలో యార్లగడ్డ ప్రణీత వెయ్యికి 987 సాధించగా, 950కిపైగా సాధించిన విద్యార్థులు 15 మంది ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డైరెక్టర్లు వేంకటప్రసాద్, మల్లిఖార్జునరెడ్డి అనిల్‌కుమార్, వాసుబాబు, డీన్ శ్రీనివాసు, అధ్యాపకులు అభినందించారు.

నారాయణలో....


గుంటూరు ఎడ్యుకేషన్: బుధవారం విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ అకడమిక్ ఇన్‌చార్జ్ తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాసరెడ్డి, కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎస్. ఆకాష్ వెంకట్ 466, సీహెచ్ బ్లెస్సీ, సాయివంశీ 465, హిరణ్మయి, లోహిత్ చంద్ర, ప్రీతమ్‌సాయి 464, కావ్య, అనీషా, నాగప్రియాంక, మణిశంకర్ 463, బైపీసీలో రుచితా హాసిని, బ్లెస్సీ 434, రోష్మిత, శ్రీ మేఘన 433, గోపిక 432తో పాటు ఇతర విద్యార్థులు మంచి మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో షబానా సుల్తానా, చరణ్‌తేజ 989, స్నేహలత, బాలకృష్ణ 988, టి. లక్ష్మి, భార్గవ్ సాయి, 987, పి. సాయి మాధురి, నజ్మా, వెంకట నారాయణ 985తో పాటు ఎంపీసీ. బైపీసీ విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఏజీఎంలు హనుమంతరావు, నరసింహారెడ్డి, సుభానీ, రాజు, డీన్లు వల్లభరావు, కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.


మేధో సంపత్తి హక్కులు సాధించాలి


మాట్లాడుతున్న టీఆర్ రమేష్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం పలికి మేథో సంపత్తి హక్కులు సాధించాలని ప్రముఖ ఐపీఆర్ కన్సల్టెంట్ టీఆర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో "మేధో సంపత్తి హక్కులు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఆర్ రమేష్ మాట్లాడుతూ యేటా ఏప్రిల్ 26న ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళా ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు కలిసి అద్భుతమైన పనిని చేయగలం అనే ఒక సంకల్పాన్ని చాటేందుకు ఇటువంటి సందర్భం అవసరమన్నారు. అన్ని ప్రాంతాల్లోని మహిళలు తమ ఊహ, చాతుర్యం, కృషితో ప్రపంచాన్ని రూపొందిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి చెందడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, వనరులు, మద్దతును పొందడంలో తరచుగా గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశలోనే పేటెంట్లు, మేధో సంపత్తి హక్కుల గురించి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ఐక్యూఏసీ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ డీవీ చంద్రశేఖర్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘల్లు.. ఘల్లుమంటూ..!


మిట్టపల్లి శ్రీవాణి


పిల్లి దుర్గారావు

పాత గుంటూరు: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో మహా మంజీర నాదం పేరున నృత్యోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం కార్యక్రమాలకు ఆలయ కార్యదర్శి బోర్ర ఉమామహేశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాకినాడకు చెందిన పిల్లి దుర్గారావు, వరంగల్‌కు చెందిన మిట్టపల్లి శ్రీ వాణి, విజయవాడకు చెందిన లంక నాగ సుస్మిత నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వీరిని యువ కళా రత్న పురస్కారంతో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం సత్కరించారు.

ఎస్‌కేబీఎంకు పూర్వవైభవం తెస్తాం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: ఏటీ అగ్రహారంలోని ఎస్.కె.బి.ఎం హైస్కూలుకు పూర్వ వైభవం తేవడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం హైస్కూలులో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులల్లో భాగంగా శ్లాబు వేసే కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతి, కార్పొరేషన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న పనుల తీరు తెన్నులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన సైట్ ప్లాన్, మార్కింగ్‌కు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా.. లేదా అనేది పరిశీలించారు. పాఠశాల అవసరాలు, పూర్వ విద్యార్థులుగా తమ ఆకాంక్షలకు తగినట్లుగా లేని కొన్ని పనులపై అభ్యంతరం తెలిపారు. తాము ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా పనులు చేపట్టే విషయంలో తమను సంప్రదించాలని సూచించారు. అందరం సమన్వయంతో కృషి చేసినప్పుడే పాఠశాల సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నాటికి అన్ని పనులు పూర్తి కావాలని సూచించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎస్‌కేబీఎంలో జీ ప్లస్ టు కేటగిరి కింద 14 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ విద్యావంతులు కావాలన్న సమోన్నత ఆశయంతో సీఎం జగన్ విద్యారంగంపై విశేషంగా దృష్టి సారించారని, సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా పలు ప్రత్యేక పథకాలతో విద్యా వ్యవస్థ రూపురేఖలు సమూలంగా మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాలపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, కాండ్రగుంట గురవయ్య, పార్టీ నాయకులు అంగడి శ్రీనివాసరావు, దేవరశెట్టి రాంబాబు, లక్ష్మణ, సురసాని వెంకటరెడ్డి, అడకా వేణు, కోలా సునీల్, మామిడి కిషోర్, ఆనంద్, సుభాని, సింగు నరసింహారావు, షేక్ నబీబాజీ, ఖైరూన్, ఖాసిం, సైదా, అబ్రహాం, నాగయ్య, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడీఈ రమేష్, ఏఈ నాగవేణి పాల్గొన్నారు.